దర్జాలేని దర్జీ

- టైలర్లను ఆదుకోని కూటమి సర్కారు
- రెడీమేడ్ మోజుతో టైలర్లకు ఆదరణ కరువు



పనులు లేక బోసిపోయిన దుకాణం

పెదగంట్యాడ: **దర్జీలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ** హయాంలో దర్జాగా **బతికారు. ప్రభుత్వం నుంచి** ఏటా రూ.10 వేల **వంతున సాయం అందేది. అలా** నాలుగేళ్లు రూ.40 **వేలు అందుకున్నారు. ఐదో ఏట** ఎన్నికల కోడ్ కారణంగా ఆ ఏడాది సాయం అందించలేకపోయారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి ఎటువంటి సాయం అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆదుకునే నాథుడి కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఆటోవాలలకు ఇచ్చిన మాదిరిగానే రూ.15వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

గతంలో దన్ను

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకాన్ని అమలు చేసి అర్హత ఉన్న ప్రతి టైలర్‌కు ఏడాదికి రూ.10 వేల చొప్పున నాలుగేళ్లు అందజేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఆ పథకం తరహాలో టైలరింగ్ చేసే ప్రతి టైలర్‌కు పథకం అమలు చేయాలని ..టైలర్స్‌కు ఆర్థిక సాయం అందించాలని గాజువాక నియోజకవర్గ టైలర్లు కోరుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత కలిగిన దర్జీలకు వారి వ్యాపార ఉన్నతికి, మెటీరియల్ కొనుగోలు నిమిత్తం చేదోడు పేరుతో ప్రతి టైలర్‌కు ఏడాదికి రూ.10 వేలు చొప్పున సాయం అందిచారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో రూ.15 వేలు ఆటో కార్మికులకు అందించిన నేపథ్యంలో దర్జీలకు కూడా రూ.15వేలు ఆర్థిక సాయం అందజేయాలని కోరుతున్నారు.



వెలవెలబోతున్న టైలరింగ్ షాప్

పనులు లేక ఇబ్బందులు

రెడీమేడ్ దుస్తులు అధికంగా రావడంతో వాటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో టైలర్లకు పనులు లేక పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. గతంలో ప్రతి టైలరింగ్ దుకాణంలో షాప్ యజమానితో పాటు పనివారు ఉండేవారు. వారికి ఉపాధి కలిగేది. ప్రస్తుతం దుకాణాదారుడికే పనులు లేని పరిస్థితిలో టైలర్లు ఉన్నారు. నాడు రద్దీగా ఉండే టైలరింగ్ షాపులు.. నేడు వెలవెలబోతున్నాయి. విద్యుత్ బిల్లులు కూడా కట్టలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టైలర్లకు చేదోడు పథకం అమలుతో పాటు విద్యుత్ బిల్లుల్లో రాయితీలు ఇవ్వాలని .. ప్రభుత్వ దుకాణాలు నిర్మించి తక్కువ అద్దెలకు షాపులు కేటాయించాలని కోరుతున్నారు.

టైలర్లను ఆదుకోవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి టైలర్‌కు సంక్షేమ పథకాన్ని అందజేసింది. టైలర్లు, కుమ్మరులు, రజకులు, ఆటో డ్రైవర్లకు, నాయీ బ్రాహ్మణులకు ఆర్థిక సాయం అందజేసింది. చాలా మంది టైలర్లు మిషన్లను ఫైనాన్స్ పై తీసుకుని పనులు నిర్వహిస్తున్నారు. వడ్డీలు, అద్దెలు, విద్యుత్ చార్జీలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం టైలర్లతో పాటు చేతి వృత్తిదారులకు కూడా సాయం ప్రకటించి ఆదుకోవాలి.

– కూనూరు మల్లికేశ్వరరావు, విశాఖ జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

రూ.15 వేలు అందించాలి



ఆటో కార్మికలకు ఇచ్చినట్టే మా టైలర్లకు ఏడాదికి రూ. 15వేలు ఆర్థిక సాయం అందించాలి.గత ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి టైలర్‌కు ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలి, దర్జీలను ఆదుకోవాలి.

– కూచిపూడి శ్రీనివాసరావు, గాజువాక టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు

గత ప్రభుత్వంలా ఆదుకోండి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగుసార్లు 10వేలు సాయం అందుకున్నాను. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పేద టైలర్లను ఆదుకోవాలి. ఈ ప్రభుత్వం ఇంతవరకూ టైలర్ల సంక్షేమానికి ఎలాంటి ప్రకటన చేయలేదు. వృత్తికి ఆర్థిక సాయం లేక పలు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే టైలర్లకు సాయం అందజేయాలి.

– కె సత్యనారాయణ టైలర్,. పెదగంట్యాడ

సిమెంట్ ఫ్యాక్టరీ వద్దేవద్దు

- మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు?
- ప్రశ్నించిన వామపక్ష నాయకులు



సంఘీభావం తెలుపుతున్న కార్పొరేటర్ స్టాలిన్, వామపక్ష నాయకులు

పెదగంట్యాడ: అభివృద్ధి అంటే ప్రజలకు మేలు చేసేలా ఉండాలని, వారి ప్రాణాలను హరించేలా ఉండకూడదని వామపక్ష నాయకులు అన్నారు. పెదగంట్యాడలో సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే ఎంత ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ మేరకు పోతిన సన్యాసిరావు భవన్‌లో వామపక్ష నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి, కార్పొరేటర్ ఏజె స్టాలిన్, గాజువాక నియోజవర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్ వల్ల ఈ ప్రాంతం కాలుష్యంతో నిండిపోతుందని, ఇప్పటికే గంగవరం పోర్టు కారణంగా కాలుష్యం కారణంగా అనేక సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. ప్రజామోదం లేకుండా ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేసినా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమలు రావాలే గానీ కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు వద్దన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలంతా ఐకమత్యంగా పోరాటాలు చేస్తుంటే స్థానిక శాసనసభ్యులు, స్థానిక పార్లమెంట్ సభ్యులు నోరు మెదపకపోవడం వెనుక కారణమేంటో అర్థం కావడం లేదన్నారు. పరిశ్రమను అంతా వ్యతిరేకిస్తుంటే మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని అధికారులు అంటుంటే ప్రజా ప్రతినిధులు ఖండించకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, దేవా, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.గోవిందరాజులు, డి.ఆదినారాయణ, వనజాక్షి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న పండితులు ,భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని ఉమామహేరస్వామి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించా రు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, ఏకాదశ రుద్రాభిషేకం, నవకలశారాధన, మూలమంత్ర హోమం జరిపించారు. పార్వతీ పరమేశ్వర్లు ఊరేగింపు (గ్రామసేవ)సాయంత్రం నిర్వహించారు. కల్యాణోత్సవం తర్వాత ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పెదమడక, అగనంపూడి సెక్టార్ –1,2,3 నిర్వాసితకాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి సంఘం సభ్యులు లోవరాజు, సన్ని, కొలిపాక అప్పారావు, అప్పలరాజు, సోమేశ్వరరావు, సూర్యారావు, సతీష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెదగంట్యాడ: మందులపై గతంలో ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించారని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ అన్నారు. పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి శనివారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ ఇన్సూరెన్స్‌పై గతంలో ఉన్న 18శాతం జీఎస్టీని రద్దు చేశారని తెలిపా రు. అలాగే క్యాన్సర్‌తో పాటు 36 రకాల వ్యాధులకు సంబంధించిన మందులపై గతంలో ఉన్న 12శాతం జీఎస్టీని రద్దు చేశారన్నారు. మెడికల్ పరికరాలైన థర్మామీటర్, మెడికల్ అనాలసిస్‌పై గతంలో ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించారన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి అరుణ ప్రకాష్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే గ్యాస్ ఆదా



గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఐఓసీ అధికారి అఖిల్

అగనంపూడి: గ్యాస్ వినియోగించే సమయంలో చిన్నపాటి జాగ్రత్తలతో గ్యాస్ ఆదాతో పాటు ప్రమాదాలను నివారించవచ్చని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ పి.అఖిల్ అన్నారు. బిందుశ్రీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అగనంపూడి సీడబ్ల్యూసీలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంట చేసేటప్పుడు మంట తక్కువలో పెట్టాలని, అలాగే వంట పూర్తయిన తర్వాత సిలిండర్ వద్ద రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని సూచించారు. లీకేజీ ఉంటే వెంటనే గ్యాస్ సిలిండర్ లేదా రెగ్యులేటర్ మార్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.షణ్ముఖరామ శ్రీనివాస్, బి.సత్యనారాయణ, కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవో 143ను రద్దు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎంపీహెచ్‌ఏలు

బీచ్‌రోడ్డు: ప్రభుత్వం జారీ చేసిన 143 జీవో వల్ల సీనియర్ ఎంపీహెచ్‌ఏ సిబ్బందికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ ప్రభుత్వ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. వెంకటలక్ష్మి కోరారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జీవో ప్రకారం కేవలం 14 మంది స్టాఫ్ మాత్రమే ఉండాలన్న నిబంధనతో వేలాది మంది ఎంపీహెచ్‌ఏ సిబ్బందికి అన్యాయం జరుగుతుందన్నారు. సుమారు 33 ఏళ్లుగా అదే క్యాడర్‌లో కొనసాగుతున్న సీనియర్ మహిళా హెల్త్ అసిస్టెంట్లు ఈ జీవో వల్ల సూపర్‌వైజర్ క్యాడర్‌కి మారే అవకాశం పూర్తిగా కోల్పోతారన్నారు.

ఘనంగా గుడివాడ జయంతి



గురునాథరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అమర్‌నాథ్ తదితరులు



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

గాజువాక: మాజీ మంత్రి, మాజీ ఎంపీ గుడివాడ గురునాథరావు 70వ జయంతిని గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ తనయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు గుడివాడ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు మింది గ్రామంలోని గురునాథరావు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురునాథరావు అందించిన సేవలను కొనియాడారు. ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి, గుడివాడ అప్పలరామ్మూర్తి, కార్పొరేటర్ పి.వి.సురేష్, నాయకులు దిలీప్, శ్రీధర్‌రాజు, గుడివాడ లతీష్, ఈటి శ్యామలరావు, సంద్రాన నూకరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో పొంచి ఉన్న ప్రమాదం

రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్న స్థానికులు



గెడ్డ వద్ద ఆడుతున్న చిన్నారులు

గాజువాక: స్థానిక సనత్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనుక గల గెడ్డ ప్రమాదకరంగా మారింది. వర్షం కురుస్తున్న సమయంలో నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని నివాసులు పేర్కొంటున్నారు. వివిధ సందర్భాల్లో గెడ్డ నిండిపోయి ఆ నీరు దానికి ఆనుకొని ఉన్న రోడ్డుపై ప్రవహిస్తోంది. స్కూలు పిల్లలు కూడా అక్కడ ఆడుకొంటుండటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ గెడ్డకు రోడ్డు కంటే ఎత్తులో రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికే స్థానికంగా ఉన్న మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు దీనిపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందించారు. ఈ నేపథ్యంలో రక్షణ గోడ నిర్మించేందుకు రూ.3.80 లక్షల అంచాన వ్యయంతో ప్రతిపాదనలు కూడా రూపొందించారు. అయితే ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. రక్షణ గోడ కోసం తాము అడిగిన ప్రతిసారి నిధులు లేవంటూ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారని ట్రస్టు అధ్యక్షుడు జాగరపు శ్రీను ఈ సందర్భంగా తెలిపారు.

ముగిసిన టెక్ రిడ్జ్ ఫెస్ట్

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (కాజుజగ్గరాజుపేట)లో రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్‌రిడ్జ్ (జాతీయ మహిళా ఫెస్ట్)శనివారంతో ముగిసింది. పాత్ర బీపీవో సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్లు ఆశిష్ మిశ్రా, ముక్కవల్లి లక్ష్మి మాట్లాడుతూ మహిళలను శాస్త్రవేత్తలుగా, పారిశ్రామికవేత్తలు తీర్చిదిద్దడానికి ఈ టెక్ ఫెస్ట్ ఎంతో దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి మాట్లాడుతూ ఉత్తమ ప్రదర్శనలు ఏర్పాటు చేసిన కళాశాలల బృందానికి రూ.మూడు లక్షల నగదు పారితోషికం అందించామన్నారు. 3845మంది మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులు 13 విభిన్న ప్రాజెక్టులు ప్రదర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రై నింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ డి.మనేంద్రసాయి, కన్వీనర్ వై.లక్ష్మణరావు, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిట్టవానిపాలెంలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన డ్రెస్సింగ్ టేబుల్, బీరువా

పెదగంట్యాడ: మండలంలోని పిట్టవానిపాలెంలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. వివరాలివి... జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పిట్టవానిపాలెంలో పిట్ట శ్రీను అనే వ్యక్తి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు ఏసీ, బీరు, డ్రెస్సింగ్ టేబుల్ తదితర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

వైభవంగా పంచముఖేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట



స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: కణితికాలనీలో నూతనంగా నిర్మించిన పంచముఖేశ్వర ఆలయంలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాల నడుమ నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నిర్వాసితకాలనీల పెద్దలు పాల్గొని పంచముఖేశ్వరుడివిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి హాజరై దేవతామూర్తులకు తొలిపూజ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడరమణికుమారి తదితరులు ఆలయాన్ని సందర్శించి పంచముఖేశ్వర స్వామికి పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. కణితి, వడ్లపూడి రహదారులు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆలయ కమిటీ పెద్దలు, కణితికాలనీ వాసులు ఏర్పాట్లు చేశారు.

భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల సందడి



బీహెచ్‌ఈఎల్ పరిపాలన భవనం

గాజువాక: స్థానిక బీహెచ్‌ఈఎల్ యూనిట్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. సంస్థలో ఉన్న అన్ని రిజిస్టర్డ్ యూనియన్లు తమ ఒరిజినల్ డాక్యుమెంట్లను యాజమాన్యానికి పది రోజుల్లోగా పంపించాలని సర్క్యులర్ వెలువడడంతో సందడి మొదలైంది. ప్రస్తుత గుర్తింపు యూనియన్ 2023 ఆగస్టు 31న ఎన్నికైన విషయం తెలిసిందే. ఆ యూనియన్ గుర్తింపు కాలం ఈ ఏడాది ఆగస్టుతో ముగిసింది. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ యూనియన్ల డాక్యుమెంట్లను సేకరించాల్సిందిగా ఆదేశిస్తూ హైదరాబాద్ లేబర్ కమిషనర్ నుంచి స్థానిక యాజమన్యానికి సర్క్యులర్ వచ్చింది. దీంతో ఆయా యూనియన్ల నాయకులు తమకు సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందని భావిస్తున్న నాయకులు ఇప్పటి నుంచే ఎత్తుగడల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం సంస్థలో 340 మందికిపైగా ఓటర్లు ఉన్నట్టు కార్మిక వర్గాలు తెలిపాయి.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు శ్రీకారం



ఉత్సవాలకు పసుపు దంచి శ్రీకారం చుడుతున్న మహిళలు

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు పసుపుకొమ్ములను తీసుకువచ్చి ఊరేగించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో పసుపు దంచారు. ఏటా కార్తీకమాసంలో ఇక్కడ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 18న వరిదుబ్బును అమ్మవారికి సమర్పించి ఆపై గౌరీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించనున్నామని సంఘం అధ్యక్షుడు ఆడారి రాము, ప్రధాన కార్యదర్శి ఆడారి బాలశ్రీను తెలిపారు. కార్యక్రమంలో మారిశెట్టి రమణాజీ, మొల్లేటి కోటేశ్వరరావు, భీశెట్టి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి



ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న ఏపీ డబ్ల్యూజేఎఫ్ నాయకులు

విశాఖ సిటీ: రాష్ట్రంలోజర్నలిస్టులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కె.విశ్వనాథన్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది. శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.శివప్రసాద్‌లు నూతన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఇప్పటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై నూతన డైరెక్టర్ విశ్వనాథన్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సోమవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిపారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వినతి

బీచ్‌రోడ్డు: ప్రభుత్వ అర్బన్ ఇ–సేవా కేంద్రాల్లో 18 సంవత్సరాల నుండి విధులు నిర్వర్తిస్తున్న 607 మందిని తిగిరి విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష నిర్వహించారు. యువగళం పాదయాత్రలో లోకేష్ మా ఇ–సేవా ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు.


అద్భుతం.. నృత్యోత్సవం



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

మద్దిలపాలెం: కళాభారతిలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం 96వ జయంతిని పురస్కరించుకుని విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ , వెంపటి చిన్న సత్యం స్థాపించిన కూచిపూడి కళాక్షేత్రం సంయుక్తంగా రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ సంప్రదాయ నృత్యం, కూచిపూడి వెంపటి జయంతి నృత్యోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో సుమారు 400 మంది చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. నగరంలో గల నాట్య గురువులందరి సహకారంతో ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు, వీఎండీఏ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, విజయనిర్మల్ అండ్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్, విజయనిర్మల కంపెనీ చైర్మన్ ఎంఎస్ శ్రీనివాస్, కూచిపూడి కళాక్షేత్ర కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఏదో ఒక సంప్రదాయ నృత్యం, సంప్రదాయ కళ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలోని నాట్య గురువులను సత్కరించారు. అలాగే విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

జీఎస్ఐతో ఏయూ ఒప్పందం



జీఎస్ఐతో ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి రంగంలో మరో ముందడుగు వేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తో ఏయూ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏయూ తరఫున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్య నారాయణ మహాపాత్రో సంతకాలు చేశారు. భారత ప్రభుత్వం నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.